తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) వారి 1988 ఉగాది మినీ కథల పోటీలో రూ. 300/-లు గెలుపొందిన కథ




రాత్రి పది గంటలయింది. రామాలయం అరుగు మీదఒళ్ళంతాదుప్పటి కప్పుకునికూర్చుని వున్నాడు సాంబయ్య. ఎదురుగా పరుగుతీస్తూ పోతున్న కొత్త వ్యక్తిని చూసాడు. మసక చీకట్లో పోల్చు కోలేకపోయాడు.

"ఎవరా పోయేదీ"

"............"

"ఎవరంటే పలకవేం!" రెట్టించాడు సాంబయ్య. ఆ వ్యక్తి పరుగెడుతూనే వున్నాడు. ఒక నిర్ణయానికొచ్చిన వాడిలా 'దొంగ దొంగ-పట్టుకోండి' అంటూ కేకలు మొదలుపెట్టాడు. వీధిలోవాళ్ళంతా హడావుడిగా బయటకొచ్చి సాంబయ్యతోపాటు ఆ వ్యక్తి వెనుక పరుగు తీశారు. పల్లపు వీధికి తిరగ్గానే పట్టుబడిపోయాడు ఆ వ్యక్తి.

"ఎక్కడికిరా! దొంగనాయాల" అంటూ సాంబయ్య ఒక్క గుద్దు గుద్దాడు. అసలే బక్కచిక్కిన అతగాడు విలవిల్లాడిపోయాడు. ఏదో చెప్పాలని ప్రయత్నం చేస్తున్నాడు. కాని ఆ గోలలో అతని ఘోష వినపడడం లేదు. వంతుల వారిగా అందరూ అతడ్ని చితక బాదారు. కళ్ళు బైర్లు కమ్మి, నిలదొక్కుకునే ఓపిక లేక కుప్ప కూలిపోయాడు.

"వచ్చాడేమోరా"

"అమ్మో! మాడండిరా బాబూ. ఏవైనా అయితే ప్రమాదం".

మాస్టారింటి ముందు లైటు వెలిగింది. జనం నెమ్మదిగా వెనక్కి తప్పుకున్నారు. లైటు వెలుగులో అతడి ముఖం స్పష్టంగా కన్పిస్తోంది.

"ఏడెవడో కాదురా. ఊరవతల పాలాల్లో బాతులోళ్ళ కుర్రాడు".

"వాడికి వూళ్లో ఏం పని?"

"సాంబయ్య మాడబట్టి సరిపోయింది. లేకపోతే ఈ పాటికి ఎవరి కొంపో దోచుకుపోయేవాడు.

మాస్టారు ముందుకొచ్చారు. ఆయనను అనుసరించి వచ్చిన ఆరేళ్ళ కూతురు వందన క్రింద పడివున్న వ్యక్తిని చూసి భయంతో తండ్రి నడుముకు చేతులు చుట్టి నిలబడింది.

"ఎవరింట్లో దొరికాడు?"

మాస్టారి ప్రశ్నకి ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఒక క్షణం తర్వాత సాంబయ్య జరిగింది చెప్పాడు.

"కేవలం అనుమానంతో ఇంత దారుణంగా బాధ పెట్టారా! దొంగతనం జరగనే లేదు కదా!"

"దొంగతనం చేసాక చేసేదేవుందయ్యా పంతులూ! అసలు ఈ బాతులోడికి రాత్రి పూట వూళ్ళో పరుగులు తియ్యాల్సిన పనేంటి? అనుమానం వచ్చింది, నాలుగు తన్నారు. తప్పేంటి. ఆడేమో నోరిప్ప లేదు మరి. దొంగనాయాలు కాకపోతే మాట్లాడొచ్చు కదా!" అంటూ వేతిక్కర నేంకి కొడుతూ రెట్టించాడు ప్రెసిడెంటు గవర్రాజు.

"త...మ్మా" బాధగా మూలిగాడా వ్యక్తి.

"బతికే వున్నాడురోయ్"

"ఏడ్నిలా వదలిపెట్ట కూడదు. తెల్లరేదాకా ఈ పంతులుగారి అరుగు స్తంభానికి కట్టి పడెయ్యండి. తెల్లారగానే పోలీసోళ్ళకి అప్పగించేద్దాం. ఎవడైనా వాడ్ని సాకినట్టు తెలిసిందో బొమిక ఎరిగిపోతయ్-తెలిసిందా?" హుకుం జారీ చేశాడు గవర్రాజు.

వెంటనే తాళ్ళతో కట్టి పడేశారు. అతగాడి నిస్స

హోయతను పరీక్ష వేసి తృప్తిగా ఎవరింటికి వాళ్ళు చేరుకున్నారు.

* * * *

ఒక రాత్రివేళ మాస్టారికెందుకో మెలకువ వచ్చింది. కూతురు పక్కలో లేకపోయేసరికి వులిక్కిపడ్డారు. వీధి తలుపు తెరిచి దగ్గరగా జారవేసి వుంది. గుండె దడదడలాడుతుండగా అటువైపు వెళ్ళి, తలుపులు నెమ్మదిగా విడదీసి అక్కడి దృశ్యం చూసి దిగ్భ్రమ చెందారు.

"నీకేం పర్లేదు. నేను నీ కట్లు విప్పుతాగా. ఎవరికీ తెలియకుండా గప్‌చిప్‌గా పారిపో" అంటూ కట్లూవిప్ప సాగింది ఆయన కూతురు.



తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి బహుమతి పొందిన కార్టూను

"నేను...నేను దొంగను కాదు తల్లీ. నా తల్లికి వున్నట్టుండి జబ్బు చేసింది. డాక్టరుబాబు నడిగి రెండు మందు బిళ్లలు పట్టుకెల్దామని కంగారుగా వచ్చాను. పరుగు తీయడమే తల్లి నేను చేసిన తప్పు" అంటూ నీరసంగా పలికాడా వ్యక్తి.

అతి కష్టం మీద కట్లు వూడదీసింది. కృతజ్ఞతా భావంతో చూసాడా వ్యక్తి.

"ఎలా కొట్టారో పాపం. నొప్పిగా వుంది కదూ!"

ఆమె జాలి మాటలకు చలించిపోయాడతను.

"నూరేళ్ళు చల్లగా బతుకు నా చిట్టి తల్లీ! నీపాటి మనసు ఆ పెద్దోళ్ళకి లేకపోయింది. ఇంక ఇక్కడుంటే నా తల్లికి ఏమయిపోతాదో. ముందామె దగ్గరికి పోయి, తెల్లారేలోగా వూరిడిచి పోతామమ్మా" అంటూ మూలుగుతున్నట్టుగా కదలిపోసాగాడు.

మాస్టారు తన కూతురిలో కలిగిన స్పందనకు ఆశ్చర్యపోయారు. 'అహింసో పరమో ధర్మః' అని బోధించే తను గుబురు మీసాల పొగరుబోతుతనానికి జంకి హింసను ఎదిరించలేకపోయాడు.

ఆ పసి హృదయం ఎంతగా స్పందిస్తే ఇంత రాత్రి ఆమెలో అలాంటి ఆలోచన కలిగించి, అంతటి ధైర్యాన్నివ్వకలిగింది.

నిర్భయంగా తలెత్తుకుని వస్తున్న కూతుర్ని చూసి తల వంచారు మాస్టారు.

